## క్లుప్తంగా

### ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న స్థల దాత నరసింహరావు దంపతులు

**ముమ్మిడివరం:** మండలంలో కమిని పంచాయతీ పరిధి సలాదివారిపాలెంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ శంకుస్థాపన గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయ నిర్మాణానికి 5 సెంట్ల భూమిని అందజేసిన దాత తాడి నరసింహరావు దంపతుల చేతుల మీదుగా భూమి పూజ చేశారు. టీటీడీ బోర్డు దళిత గోవిందం పథకంలో రూ.10 లక్షలు మంజూరు చేయగా ఆ నిధులకు దాతల విరాళాలు జోడించి ఆలయం నిర్మించనున్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, పితాని బాలకృష్ణ, దూళిపూడి బాబి, అర్దాని శ్రీనివాసరావు, సలాది రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

### కోడిపందేల శిబిరంపై దాడి

**ముమ్మిడివరం:** ముమ్మిడివరం నగర పంచాయతీ శివారు బొండాయికోడు సమీపంలో గురువారం ఉదయం కోడి పందేలు నిర్వహిస్తున్న శిబిరంపై ఎస్‌ఐ కె.సురేష్‌బాబు ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేసి 9 మందిని అరెస్ట్ చేశారు. వారి నుంచి రెండు కోడిపుంజులు, రూ.2,600 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టుకు తరలించినట్లు ఎస్‌ఐ సురేష్‌బాబు తెలిపారు.

### నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**ముమ్మిడివరం:** ముమ్మిడివరం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో వార్షిక మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు పనుల నిమిత్తం పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు ట్రాన్స్‌కో డీఈ ఎం.రవికుమార్ తెలిపారు. మండలంలోని అనాతవరం, ముమ్మిడివరం ఆర్‌డబ్ల్యూఎస్ ఫీడర్, పట్టణ పరిధిలో ఉన్న గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు చెప్పారు.

### దోషులను కఠినంగా శిక్షించాలి

**ముమ్మిడివరం:** కాకినాడ జిల్లా తొండంగి మండలం శృంగవృక్షం గ్రామంలో దళిత యువకుడు నడిపల్లి రామును హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. రామును హత్య చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. రాము కుటుంబానికి రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా, 2 ఎకరాల భూమి, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్న డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ యడ్ల రాంబాబుకు అందజేశారు. కార్యక్రమంలో కేవీపీ నాయకులు ఉండ్రవరపు ప్రసాద్, నిమ్మకాయల వెంకటేష్, రేవు శ్రీనివాసరావు, జి.దుర్గా ప్రసాద్, పాము బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

### దోషులను కఠినంగా శిక్షించాలి

**తాళ్లరేవు:** తొండంగి మండలం శృంగవృక్షం గ్రామంలో రాము అనే దళిత యువకుడిని హత్యచేసిన దోషులను కఠినంగా శిక్షించాలని విశ్వజన కళామండలి జిల్లా అధ్యక్షుడు వడ్డి ఏడుకొండలు గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. రాముని చంపినవారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని, అతడి కుటుంబానికి రూ.25 లక్షలు నష్టపరిహారం అందించాలని కోరారు.

### వేట నిషేధ పరిహారం పెంపు

**యానాం:** యానాం, పుదుచ్చేరి, మాహే, కారైకాల్‌లో మత్స్యకారులకు వేట నిషేధ సమయంలో ఇచ్చే పరిహారాన్ని రూ.5,500 నుంచి రూ.6,500కు పెంచుతూ ఎల్‌జీ తమిళసై సౌందర్యరాజన్ ఆదేశాలు జారీ చేశారని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వృద్ధాప్య పెన్షన్ సైతం రూ.2500 నుంచి రూ.3,000కు పెంచుతూ ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. యానాంలో ఓటర్ కార్డుకు ఆధార్ నెంబర్ అనుసంధాన ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. మత్స్యకారులకు వేట నష్ట పరిహారం పెంపు చేసినందుకు ఎల్‌జీ, సీఎం రంగసామిలకు అశోక్ కృతజ్ఞతలు తెలిపారు.

### విచారణ నిర్వహించాలి

**యానాం:** ప్రభుత్వం సబ్సిడీ ద్వారా ఇచ్చే పశుదాణా పక్కదోవపడుతుందని, దీనిపై విచారణ నిర్వహించాలని కోరుతూ స్థానిక నాయకుడు మాగాపు సుబ్బారావు డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్థానిక డిపార్ట్‌మెంట్ ఆఫ్ యానిమల్ హజ్బెండరీ అండ్ యానిమల్ వెల్ఫేర్ శాఖ నుంచి వచ్చే దాణాను రైతులకు సబ్సిడీపై రెండు దఫాలు ఇచ్చారన్నారు. అయితే దాణాను ఎవరికిస్తున్నారో తెలియడం లేదని, అర్హులైన రైతులు వెళుతుంటే దాణా అయిపోయిందంటూ చెబుతున్నారని ఆరోపించారు. దీనిపై విచారణ జరిపించాలని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్, ఆర్‌ఏఓ మునిస్వామిలను కోరుతున్నట్లు చెప్పారు.

# ముత్యాల్లాంటి అక్షరాలు.. తెస్తాయి మార్కులు

- పరీక్షల్లో ఉత్తీర్ణత కోసం దస్తూరీకి ప్రాధాన్యం
- నిత్య సాధనతో సాధ్యమేనంటున్న ఉపాధ్యాయులు

**ముమ్మిడివరం:** పదో తరగతి పరీక్షలు ముంచుకొస్తుండటంతో విద్యార్థులు రాత్రింబవళ్లు పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఫలితాలు సాధించేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులు ఏడాది పాటు నేర్చుకున్న అంశాలను రెండున్నర గంటల్లో కాగితంపై పెట్టాలి. అదీ స్పష్టంగా.. ఎలాంటి కొట్టివేతలు లేకుండా ముత్యాల్లాంటి అక్షరాలతో రాయాల్సి ఉంటుంది. అందుకే పరీక్షలకు చదువుకోవడంతో పాటు అందమైన చేతిరాతపైనా దృష్టి సారించాలని విద్యార్థులకు ఉపాధ్యాయులు సూచిస్తున్నారు.

**సాధనతో మంచి ఫలితాలు**

పరీక్షల్లో వచ్చిన ప్రశ్నలకు జవాబులు ఎంత బాగా గుర్తున్నా చేతిరాత బాగోకపోతే మార్కులు సాధించడం కష్టతరమవుతుంది. పరీక్షా పత్రాలు దిద్దేవారిని ముత్యాల్లాంటి అక్షరాలతో ఆకట్టుకోగలిగితే కచ్చితంగా మార్కుల శాతం పెంచుకోవొచ్చని విద్యావేత్తలంటున్నారు. రాసే ప్రతి అక్షరం అక్షర దోషాలు లేకుండా అందంగా గుండ్రంగా ఉండడంతో పాట అవసరమైన చోట ఫుల్‌స్టాప్, కామా తదితర గుర్తులు ఉపయోగించి సమాధానాలిస్తే మంచి మార్కులు సాధ్యమవుతాయి. అక్షరాలు కొన్ని చిన్నవిగా మరికొన్ని పెద్దవిగా ఉండకుండా విద్యార్థులు జాగ్రత్తలు తీసుకోవాలి. నెమ్మదిగా రాస్తే పరీక్షల్లో సమయం సరిపోదు.. వేగంగా రాసేటప్పుడు తప్పులు దొర్లకుండా ముత్యాల్లాంటి అక్షరాలు రాసేందుకు ప్రత్యేక తరగతులు, స్లిప్ పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

పైకి చదువుకుంటూ రాయడం చేస్తే పాఠాలు బాగా గుర్తుండడంతో పాటు అందమైన దస్తూరీ సాధ్యమవుతుందని సూచిస్తున్నారు. రాత్రికి రాత్రి చేతిరాత మారిపోవాలంటే సాధ్యమయ్యే పని కాదు కాని నిత్యం సాధన చేస్తే అందమైన దస్తూరీని అలవరచుకోవొచ్చు. తెలుగులోనే కాకుండా ఆంగ్లం, హిందీ తదితర ఏ సబ్జెక్టుకైనా ఇదే విధానం మార్గదర్శకం.



ప్రత్యేక తరగతుల్లో చదువుకుంటున్న విద్యార్థులు

**చేతి రాత మెరుగుపడింది**



మా పాఠశాలలో ప్రత్యేక తరగతుల్లో పాఠాలు చదివించాక ఆయా ప్రశ్నలకు జవాబులు రాయిస్తున్నారు. చేతిరాతపై నిత్యం సాధన చేయిస్తున్నారు. దీంతో గతంలో కంటే ఇప్పుడు నా రాత మెరుగుపడింది. తప్పులు లేకుండా అక్షరాలు గుండ్రంగా రాయడం అలవాటైంది.

– పాము ప్రణవి, పదో తరగతి విద్యార్థిని

**అందమైన దస్తూరీతో మార్కులకు భరోసా**



పదో తరగతి పరీక్షల్లో అందమైన దస్తూరీతో ప్రశ్నాపత్రం నింపితే మార్కులకు దోకా ఉండదు. అదే చేతి రాత ఏమాత్రం అస్పష్టంగా ఉన్నా ఇబ్బందే. అందుకే విద్యార్థుల చేతిరాత మెరుగుపరిచేందుకు ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నాం.

– పచ్చిమల శివనాగరాజు, తెలుగు పండితుడు

### వెంకటేశ్వరరావుకు కలెక్టర్ సత్కారం



వెంకటేశ్వరరావును సత్కరిస్తున్న జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా తదితరులు

**అమలాపురం రూరల్:** రాష్ట్ర వికలాంగుల మహా సంఘటన సంక్షేమ సేవా సంఘం ద్వారా ఉగాది ఉత్తమ సేవ అవార్డు సాధించిన చిందాడగరువు చెందిన సామాజిక కార్యకర్త మోటూరి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ కనక దుర్గ దంపతులను కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ చేతుల మీదుగా వెంకటేశ్వరరావుకు అవార్డు అందించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ సీహెచ్ సత్తిబాబు, జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి రామ్‌గోపాల్, సేవా సంఘం ప్రతినిధి నిమ్మకాయల సురేష్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు సంసాని నాని తదితరులు పాల్గొన్నారు.

## కల్యాణోత్సవాల పోస్టర్లు ఆవిష్కరించిన మంత్రి



కల్యాణోత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మంత్రి విశ్వరూప్

**అమలాపురం టౌన్:** కోనసీమ పెళ్లిళ్ల వెంకన్నగా పేరుగాంచిన అమలాపురం వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 28వ తేదీ నుంచి కల్యాణోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్లను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అమరావతిలో గురువారం రాత్రి ఆవిష్కరించారు. మంత్రి విశ్వరూప్‌కు ఆలయ చైర్‌పర్సన్ దూడల వెంకట విరీతాదేవి కల్యాణోత్సవాల తొలి ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు దూడల ఫణి, ఆలయ ధర్మకర్త నడింపల్లి వర్మ పాల్గొన్నారు.

# రంజాన్ వేడుకలకు శ్రీకారం

- నేటి నుంచి ఉపవాస దీక్షల్లో ముస్లింలు
- విద్యుత్ దీపాల అలంకరణలతో ముస్తాబైన మసీదులు



రంజాన్ వేడుకలకు ముస్తాబైన అమలాపురం ముల్లా ముస్తాఫా మసీదు

**అమలాపురం టౌన్:** రంజాన్ మాసాన్ని పరమ పవిత్రంగా నిర్వహించుకోవడానికి ముస్లింలు సిద్ధమవుతున్నారు. కోనసీమలోని సుమారు 40 మసీదుల్లో శుక్రవారం తెల్లవారుజాము నుంచి రంజాన్ వేడుకలకు శ్రీకారం చుడుతున్నారు. నింగిలో చంద్రుడిని వీక్షించి రంజాన్ నెల ఉపవాస దీక్షను మొదలు పెట్టి మళ్లీ నెల రోజుల తర్వాత అదే చంద్రుడిని చూసి దీక్ష విరమిస్తారు. రోజుకు అయిదు దఫాలు నమాజ్‌లు నిర్వహించే ముస్లింలు మసీదులను రంజాన్ వేడుకల కోసం విద్యుత్ దీపాలతో అలంకరించి దేదీప్యమానమైన వెలుగులు నింపారు. అమలాపురంలోని ముల్లా ముస్తాఫా మసీదు, జామియా మసీదు, హష్మా షరిమా(షియా) మసీదుల్లో రంజాన్ వేడుకల కోసం ఏర్పాట్లు చేశారు.

అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల్లో ఉన్న 17 మసీదుల్లో రోజూ ఖురాన్ గ్రంథంలోని 20 రకాతులను పఠించేలా ఏర్పాట్లు చేశారు. దీనికోసం గ్రంథాన్ని హృదయ పూర్వకంగా చదివే గ్రంథ నిపుణులను ఇతర రాష్ట్రాల నుంచి రప్పించి మసీదుల్లో నెల రోజులూ పఠనం గావిస్తారు. అమలాపురం ముల్లా మస్తాఫా మసీదు కోసం బీహార్ రాష్ట్రం నుంచి సద్దామ్ హుస్సేన్ అనే గ్రంథ పఠన నిపుణుడు గురువారం నాటికే పట్టణానికి చేరుకున్నట్లు మసీదు పెద్ద ఎండీ అమీర్ తెలిపారు. రోజూ తెల్లవారుజామున సహారీ, సాయంత్రం ఇఫ్తార్ పేరుతో ఉపవాస దీక్షలు సాగుతాయి. అమలాపురం మసీదుల్లో రంజాన్ పర్వదిన తొలి రోజు శుక్రవారం తెల్లవారుజామున 4.43 గంటలకు సహరీ, సాయంత్రం 6.24 గంటలకు ఇఫ్తార్ విందు నిర్వహించనున్నారు. అమలాపురం ముల్లా ముస్తాఫా మసీదుకు చెందిన మరో పెద్ద మొయినుద్దీన్ మాట్లాడుతూ ముస్లింలు రంజాన్ మాసం అంతా ఉపవాస దీక్షల్లోనే నిమగ్నం అవుతారని చెప్పారు.

## చెత్త నుంచి సంపద సృష్టించాలి



చెత్తను సేకరించే విధానంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**అల్లవరం:** గ్రామాల్లో పేరుకుపోయిన చెత్తను సాలిడ్ వేస్ట్ ప్రోసెసింగ్ కేంద్రాలకు తరలించి సంపద సృష్టించుకోవాలని డీఎల్‌పీఓ మల్లికార్జున రావు అన్నారు. అల్లవరం మండలం కొమరగిరిపట్నంలో ఎంపీడీఓ జి.సరోవర్ అధ్యక్షతన జగనన్న స్వచ్ఛ సంకల్పంపై అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఐదు రోజుల పాటు జరిగే కార్యక్రమంలో తొలి రోజున పేరూరు, జనుపల్లి, గాడిలంక, కొత్తలంక సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, కార్యదర్శులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎల్‌పీఓ మల్లికార్జునరావు మాట్లాడుతూ చెత్త నుంచి సంపదని సృష్టించుకుంటే గ్రామాభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడడంతో పాటు గ్రామాలు పరిశుభ్రంగా ఉంటాయని సూచించారు. పంచాయతీ పాలకవర్గాలు దృష్టి సారించి సంపదను పెంచుకునే దిశగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, ముమ్మిడివరం ఎంపీడీఓ శ్రీనివాస్, అమలాపురం ఎంపీడీఓ కేవీ ప్రసాద్, ట్రైనింగ్ కోఆర్డినేటర్ మధు మహేష్, స్థానిక సర్పంచ్ రాకాపు విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## శ్మశానవాటిక ఆక్రమణకు గురైందంటూ ధర్నా

- ఇరు వర్గాల మధ్య తోపులాట



ఎన్.కొత్తపల్లిలో గ్రామస్తులతో చర్చిస్తున్న తహసీల్దార్ వెంకటేశ్వరి

**ఉప్పలగుప్తం:** మండలంలోని ఎస్.కొత్తపల్లి గ్రామంలో శ్మశానవాటికకు సంబంధించిన భూమి ఆక్రమణకు గురైందంటూ గ్రామస్తులు గురువారం ధర్నా చేపట్టారు. ఉప్పలగుప్తం రెవెన్యూ పరిధి వానపల్లిపాలెం గ్రామంలో పాత ఐనాపురం మేజర్ డ్రెయిన్ గట్టును ఆనుకుని ఉన్న సర్వే నెం.566లో కొంత ప్రభుత్వ భూమిని తాము శ్మశానవాటికగా ఉపయోగించేవాళ్లమని, అయితే గ్రామానికి చెందిన ఓ రైతు ఆక్రమించాడని ఆరోపిస్తూ ఆందోళన నిర్వహించారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ జి.వెంకటేశ్వరరావు, తహసీల్దార్ జె.వెంకటేశ్వరిలు ఘటనా స్థలానికి చేరుకున్నారు. అయితే సదరు భూమి డాక్యుమెంట్‌ను పరిశీలించి అది రైతుకే చెందుతుందని తహసీల్దార్ వెంకటేశ్వరి చెప్పారు. ఆ డాక్యుమెంట్‌ను సృష్టించారని గ్రామ పెద్దలు ఆరోపించడంతో ఇరువర్గాల మధ్య మాటల యుద్ధం జరిగి తోపులాటకు దారి తీసింది. దీంతో పోలీసులు ఉద్రిక్తతను అణచివేశారు. స్థలానికి చెందిన పూర్వపు రికార్డులను పూర్తి స్థాయిలో పరిశీలించి ఇరు వర్గాలతో మరోమారు చర్చిస్తామని తహసీల్దార్ హామీ ఇవ్వడంతో గ్రామస్తులు తాత్కాలికంగా ఆందోళన విరమించారు.

## డంపింగ్ యార్డ్‌కు స్థలాన్ని కేటాయించాలి



అంబాజీపేటలో ఆర్డీవో ముక్కంటికి వినతిపత్రం అందిస్తున్న ఎంపీపీ, సర్పంచ్

**అంబాజీపేట:** గ్రామంలో సేకరించిన చెత్తను వేసేందుకు డంపింగ్ యార్డు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తక్షణమే స్థలాన్ని కేటాయించాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారిలు కొత్తపేట ఆర్డీవో ఎం.ముక్కంటికి వివరించారు. అంబాజీపేట తహసీల్దార్ కార్యాలయంలో మాచవరం పంచాయతీకి సంబంధించి చెత్త వేసేందుకు స్థలాన్ని ఏర్పాటు చేయాలంటూ వినతి పత్రాన్ని గురువారం అందజేశారు. మాచవరంలో చెత్త నుంచి సంపద కేంద్రానికి, అంబాజీపేట హడ్కో కాలనీ శివారు కౌశిక ప్రాంతంలో చెత్త వేసేందుకు వెళ్లిన ట్రాక్టర్లను స్థానికులు అడ్డుకుంటున్నారని ఈ విషయాన్ని డీఎల్పీఓకు వివరించామన్నారు. నెల రోజులు గడిచినా చెత్త వేసుకునేందుకు స్థలం చూపించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. తక్షణమే ప్రభుత్వ స్థలాన్ని ఏర్పాటు చేసి చెత్త సమస్యను పరిష్కరించాలని ఆర్డీవోను కోరారు. ఆర్డీఓ వెంట తహసీల్దార్ టి.మంగతాయారు ఉన్నారు.

### భూవివాదాల ఫిర్యాదులకు ప్రత్యేక విభాగం

**యానాం:** భూవివాదాల ఫిర్యాదుల స్వీకరణ కోసం రెవెన్యూ శాఖ ద్వారా ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయనున్నట్లు సీఎం రంగసామి తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆ విభాగంలో సబ్ కలెక్టర్(రెవెన్యూ), సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్, తహసీల్దార్, సబ్ రిజిస్ట్రార్ సభ్యులుగా ఉంటారన్నారు. ఇప్పటికే కమిటీ ఏర్పాటుకు నోటిఫికేషన్ జారీ చేశామన్నారు.

### పేదలకు పండ్లు, పాలు అందజేత

**ముమ్మిడివరం:** సినీ నిర్మాత తాడి తాతారావు 74వ జయంతి సందర్భంగా ఆయన కుమార్తె అల్లాడి రమణికుమారి పేదలకు పండ్లు, పాలు అందజేశారు. గురువారం స్థానిక టీటీఆర్ ఘాట్‌లో ఉన్న తాతారావు విగ్రహానికి ఆయన కుటుంబసభ్యులైన తాడి నాగేశ్వరరావు, తాడి సత్యనారాయణ, పెదనరసింహరావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

### ఉచిత సీట్లకు దరఖాస్తు చేసుకోవాలి

**తాళ్లరేవు:** 2023–24 విద్యా సంవత్సరానికి గాను ప్రైవేట్ పాఠశాలల్లో 1వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈఓ ఎ.మంగాయమ్మ గురువారం ఓ ప్రకటనలో కోరారు. విద్యా హక్కు చట్టం ప్రకారం 25 శాతం సీట్లను నిరుపేదలకు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. వీరిలో అనాథ పిల్లలు, హెచ్‌ఐవీ ఎఫెక్టెడ్, ప్రత్యేక అవసరాల గల విద్యార్థులకు 5 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 4 శాతం, గ్రామీణ ప్రాంతంలో రూ.1.20 లక్షల లోపు, పట్టణ ప్రాంతంలో రూ.1.44 లక్షలు కన్నా తక్కువ ఆదాయం గల కుటుంబాల విద్యార్థులకు 6 శాతం సీట్లు కేటాయించామన్నారు. అర్హులైన వారు ఈ నెల 22వ తేదీ నుంచి వచ్చే నెల 10వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

## ముగిసిన అమ్మవారి జాతర మహోత్సవాలు



మురమళ్ల మాణిక్యాంబ అమ్మవారు

**ఐ.పోలవరం:** మురమళ్ల మాణిక్యాంబ అమ్మవారి జాతర, తీర్థ మహోత్సవాలు గురువారం అంగరంగ వైభవంగా ముగిశాయి. చివరి రోజు అధిక సంఖ్యలో భక్తులు వచ్చి అమ్మవారికి మొక్కుబడులు తీర్చుకొన్నారు. ఫిబ్రవరి 18 నుంచి ఈ నెల 23 వరకూ రోజూ నిత్యాన్నదానం, రాత్రి అమ్మవారి జాతర ఉత్సవాలు జరిపారు. ఉగాది పర్వదినం పురస్కరించుకొని ఆలయ ఆవరణలో భజన కాలక్షేపం, బుధవారం రాత్రి గరగ నృత్యాలు, బాజా భజంత్రీలు, మేళతాళాలతో గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో నిప్పుల గుండం కార్యక్రమం జరిగింది. ఆలయం వద్ద భారీ అన్నసమారాధన చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది.

## బీపీఎల్ విజేత మెకానికల్ జట్టు



విజేతలతో కళాశాల అధినేత బోనం కనకయ్య తదితరులు

**అమలాపురం రూరల్:** భట్లపాలెం బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలల్లో గత 15 రోజులుగా కొనసాగుతున్న బీపీఎల్ క్రికెట్ టోర్నమెంట్‌లో మెకానికల్ జట్టు విజేతగా నిలిచింది. గురువారం సీఎస్‌ఈ–మెకానికల్ జట్ల మధ్య ఉత్కంఠగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో ఒక ఓవర్ మిగిలి ఉండగానే 104 పరుగుల లక్ష్యాన్ని మెకానికల్ జట్టు ఛేదించింది. విజేతలకు కళాశాల అధినేత బోనం కనకయ్య ట్రోఫీలను అందజేశారు. రిఫరీలుగా వ్యవహరించిన సురేష్, విక్రమ్‌లను సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జేవీసీ రామారావు, ఏవో కృష్ణారావు, క్రీడా కమిటీ సభ్యులు సర్వారాయుడు, గోలకోటి మూర్తి, రవణం మాధవి తదితరులు పాల్గొన్నారు.

### ఇంటింటా మధుమేహ పరీక్షలు



తాళ్లరేవు కేశవపురంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మధుమేహ పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

**తాళ్లరేవు:** తాళ్లరేవు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గత 15 రోజులుగా తాళ్లరేవు పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో డయాబెటిక్ స్క్రీనింగ్ అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. దీంట్లో భాగంగా గురువారం కేశవపురంలో ఇంటింటికీ వెళ్లి సుమారు 76 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో ఐదుగురికి షుగర్ ఉన్నట్లు తేలిందని లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు బిళ్లకుర్తి శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఇప్పటివరకు పంచాయతీలో 1500 మందిని పరీక్షించగా సుమారు 200 మందికి షుగర్ ఉన్నట్లుగా నిర్ధారణ అయ్యిందన్నారు.

# అమరవీరులకు ఘన నివాళి



అమరవీరుల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం



భగత్ సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జిల్లా ఏఐవైఎఫ్ ప్రతినిధులు

**తాళ్లరేవు:** భారత స్వాతంత్ర్య ఉద్యమంలో అసువులు బాసిన అమరవీరులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతి సందర్భంగా గురువారం స్థానిక ప్రజా సంఘాల భవనంలో వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ టేకు మూడి ఈశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కేఎస్ శ్రీనివాస్, వడ్డి ఏడుకొండలు, అత్తిలి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

**భగత్‌సింగ్ వర్ధంతి**

**ముమ్మిడివరం:** స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్ వర్ధంతిని సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పాము బాలయ్య, పి.వసంతకుమార్, జి.దుర్గాప్రసాద్, సఖిలే సూర్యనారాయణ, బీవీ రాఘవులు, జి.సత్యనారాయణ, వి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**ఘనంగా భగత్ సింగ్ వర్ధంతి**

**అమలాపురం టౌన్:** స్థానిక నారాయణపేటలో ఆల్ ఇండియా యూత్ ఫెడరేషన్(ఏఐవైఎఫ్) జిల్లా శాఖ ఆధ్వర్యంలో భగత్ సింగ్ 92వ వర్ధంతి కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల త్యాగం అజరామరమని కొనియాడారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ బందారు బాలకృష్ణ, భవిరిశెట్టి చిన్న, ఏసురాజు, రాజు ప్రసాద్ పాల్గొన్నారు.